గంటలకొద్దీ ట్రాఫిక్‌లోనే..

ప్రత్యక్ష నరకం చూస్తున్న వాహన చోదకులు ● ఖైతలాపూర్, పర్వత్‌నగర్ రహదారి విస్తరణ జరిగేనా?


అడ్డదిడ్డంగా వెళ్తున్న వాహనాలు

హైటెక్ సిటీ, మే 19(ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న వాహనాల సంఖ్యకు అనుగుణంగా రహదారులు వెడల్పు లేకపోవడంతో పర్వత్‌నగర్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద నిత్యం వాహనదారులు ట్రాఫిక్ సమస్యతో సతమతమవుతున్నారు. ఖైతలాపూర్ ఫ్లైఓవర్ నుంచి మాదాపూర్ వచ్చే వాహనాల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. ఉదయం 7:30 గంటల నుంచి 11గంటల వరకు, సాయంత్రం 5గంటల నుంచి 8:30గంటల వరకు వేలాదిమంది వాహనదారులు ఆ మార్గంలో పయనిస్తారు. నాలుగు రోడ్ల కూడలి కావడంతో అక్కడ ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఏమీ చేయలేక చేతులెత్తేస్తున్నారు. బోరబండ నుంచి మాదాపూర్ ప్రధాన రహదారికి, సైబర్ టవర్ నుంచి ఖైతలాపూర్ ఫ్లైఓవర్ మీదగా కూకట్‌పల్లి వెళ్లేవారు ఎక్కువగా ఈ మార్గంలో పయనిస్తారు. వాహనాలు అన్నీ ఒకేసారి రావడంతో ట్రాఫిక్ నియంత్రణ కష్టతరంగా ఉందని అక్కడ ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారి సురేష్ తెలిపారు.

సిగ్నల్ దాటాలంటే అరగంట

మాదాపూర్‌లోని 100 ఫీట్ల రోడ్‌లో ప్రయాణం అంటేనే నగరవాసులు భయపడిపోతున్నారు. ఈ ప్రాంతం నిత్యం ట్రాఫిక్ సమస్యలతో వాహనదారులను భయపెడుతోంది. పెరిగిన వాహనాలు, ఇరుకైన రోడ్లు, దీనికి తోడు విపరీతమైన రద్దీ కారణంగా వాహనదారులు పద్మవ్యూహం లాంటి ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నారు. ఎలాగైనా ట్రాఫిక్‌లో నుంచి తప్పించుకోవాలనే ఉద్దేశంతో కొందరు వాహనదారులు ట్రాఫిక్ రూల్స్‌ను పాటించడం లేదు. దీనికి తోడు నిత్యం విపరీతమైన రద్దీ ఉండే 100 ఫీట్ల రోడ్ పర్వత్‌నగర్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ పోలీసు సిబ్బంది ఉదయం, సాయంత్రం మినహా మిగిలిన సమయంలో సిగ్నల్ వ్యవస్థను ఆటోమేటిక్ మోడ్‌లో ఉంచి పత్తాలేకుండా పోతుండడంతో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమవుతుంది. ఉదయం 9గంటల నుంచి రాత్రి 10గంటల వరకు మాదాపూర్ పర్వతనగర్ జంక్షన్ నుంచి అటు సైబర్ టవర్స్, హైటెక్‌సిటీ, అయ్యప్ప సొసైటీ వైపు వెళ్లాలన్నా, ఇటు కేపీహెచ్‌బీ కైతలాపూర్ రైల్వే బ్రిడ్జి వైపు వెళ్లాలన్నా, అదేవిధంగా మాదాపూర్ పోలీస్ స్టేషన్ వైపు, నీరుస్ చౌరస్తా వైపు రాకపోకలు జరపాలంటే పర్వత్‌నగర్ సిగ్నల్ దాటాలంటే సుమారు 30 నిమిషాల నుంచి గంట సమయం పడుతుందంటే ఇక్కడ పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. నీరుస్ చౌరస్తా నుంచి అయ్యప్ప సొసైటీ, 100 ఫీట్ రోడ్డు వైపునకు వెళ్లేందుకు పర్వత్‌నగర్ సిగ్నల్ వద్ద ఫ్రీ లెఫ్ట్ బోర్డ్ సైతం ఉన్నప్పటికీ రద్దీ కారణంగా వాహనదారులు ఫ్రీ లెఫ్ట్ మార్గాన్ని సైతం ఆక్రమించేస్తుండడంతో ఆ వైపు వెళ్లే వాహనదారులు సైతం గంటల తరబడి ట్రాఫిక్‌లో ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడడంతో కిలోమీటర్ పొడవునా వాహనాలన్నీ రోడ్డుపై నిలబడి పోతున్నాయి. మధ్యాహ్నం 12గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నెత్తిన భానుడి భగభగలు, కాళ్ల కింద తారురోడ్డు సెగల మధ్య ట్రాఫిక్‌లో చిక్కుకున్న నగర ప్రజలు, చిన్నపిల్లల అవస్థలు వర్ణనాతీతం. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు స్పందించి నిత్యం విపరీతమైన ట్రాఫిక్‌తో రద్దీగా ఉండే 100 ఫీట్ల రోడ్డును వెడల్పు చేయడంతో పాటు పర్వత్‌నగర్ సిగ్నల్ వద్ద ట్రాఫిక్ సిబ్బంది పగటి సమయం పూర్తిగా అందుబాటులో ఉండేలా చూడాలని వాహనదారులు కోరుతున్నారు


మాదాపూర్‌లోని 100 ఫీట్ల రోడ్‌లో ట్రాఫిక్ జాం

జైహింద్ లేఅవుట్ జంక్షన్ వద్ద..

మాదాపూర్ 100 అడుగుల రోడ్డు నుంచి అయ్యప్ప సొసైటీ 60 ఫీట్ల రోడ్డులోకి వెళ్లే జంక్షన్ వద్ద ట్రాఫిక్ అధికారులు సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. అయితే, అక్కడ సిగ్నల్స్ ఎంతో కాలంగా పనిచేయకపోవడంతో ట్రాఫిక్ నియంత్రణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మాదాపూర్ నుంచి పర్వత్నగర్ జంక్షనుకు వచ్చే వాహనాలన్నీ ఒకేసారి రావడంతో 3 నుంచి నాలుగు నిమిషాల పాటు నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. ముఖ్యంగా ఖైతలాపూర్ సిగ్నల్ నుంచి పర్వత్‌నగర్ సిగ్నలుకు వచ్చే రహదారిని వెడల్పు చేస్తే ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుందని వాహనదారులు పేర్కొంటున్నారు.

బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో మహిళ పర్సు చోరీ

అమీర్‌పేట, మే 19 (ఆంధ్రజ్యోతి): బంగారు ఆభరణాలు, క్రెడిట్, డెబిట్ కార్డులతో ఉన్న మహిళ పర్సు బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో చోరీకి గురైంది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఎస్ఆర్‌నగర్ పోలీసులు సోమవారం వెల్లడించారు. సికింద్రాబాద్ చిలకలగూడకు చెందిన అనంతాల సుధ బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేట్ సంస్థలో పని చేస్తోంది. ఆదివారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులతో కలిసి బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకునేందుకు వచ్చారు. ఆమె వద్ద ఉన్న బంగారు గొలుసు, బ్రాస్‌లెట్, క్రెడిట్, డెబిట్ కార్డులతో పాటు చెవి రింగులు ఓ పర్సులో పెట్టి హ్యాండ్ బ్యాగులో వేసింది. అమ్మవారి దర్శనం అనంతరం బ్యాగులోని పర్సు కోసం చూడగా పర్సు కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. చోరీకి గురైన వస్తువుల విలువ రూ.60 వేలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా గత 12వ తేదీన కూడా కూతురుతో కలిసి అమ్మవారిని దర్శించుకున్న ఓల్డ్ బోయిన్‌పల్లికి చెందిన అర్లగడ్డ రాజశేఖర్ ఆలయం ముందున్న స్టాండ్‌లో తన పాదరక్షలు తీసుకుంటుండగా వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి పాదరక్షలకు సంబంధించి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేసి, అతన్ని వెంబడిస్తూ క్యాబ్‌లోకి ఎక్కుతున్న రాజశేఖర్ సెల్‌ఫోన్‌ను లాక్కొని పరారయ్యాడు. వరుసగా జరుగుతున్న దొంగతనాలతో భక్తులు ఆందోళన చెందుతున్నారు. ఈ దొంగతనాలపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు దృష్టి సారించడంతో పాటు ఆలయ అధికారులు సెక్యూరిటీ సిబ్బందిని పెంచాలని కోరుతున్నారు.

పర్సు చోరీ.. ఆన్‌లైన్‌లో నగదు మాయం

యూసుఫ్‌గూడ, మే 19 (ఆంధ్రజ్యోతి): జేబులోంచి పర్సు చోరీకి గురవడంతో పాటు ఆన్‌లైన్‌లో నగదు మాయమైన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణా జిల్లాకు చెందిన ఎన్.నాగరాజు జవహర్‌నగర్‌లో నివాసం ఉంటు ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 18న రెపల్లె నుంచి సికింద్రాబాద్ రైల్‌లో ప్రయాణించాడు. ఇంటికి వచ్చి పర్సును చూడగా లేదు. ఆన్‌లైన్‌లో తన పెడరల్ బ్యాంకు ఖాతా నుంచి రూ.75వేల నగదును డ్రా చేసినట్లు సెల్‌కు ఎస్ఎంఎస్ వచ్చింది. బాధితుడు వెంటనే మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

అల్మారీలోంచి బంగారు పుస్తెల తాడు చోరీ

బేగంపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): అల్మారీలో ఉన్న 30గ్రాముల బంగారు పుస్తెల తాడు చోరీకి గురైన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జింకలవాడలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సనత్‌నగర్‌లోని జింకలవాడలో ఉంటున్న నర్సు శనిగరపు సోనీ (27) ఈ నెల 17న ఇంట్లోని అల్మారలో పుస్తెల తాడు పెట్టి స్నానానికి వెళ్లింది. అనంతరం వచ్చి చూడగా అల్మారిలో ఉండాల్సిన పుస్తెల తాడు కనబడలేదు. దీంతో బాధితురాలు వెంటనే సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పనిచేస్తున్న సంస్థకే కన్నం

● నిందితుడిపై బంజారాహిల్స్ పీఎస్‌లో కేసు నమోదు

బంజారాహిల్స్, మే 19(ఆంధ్రజ్యోతి): పనిచేస్తున్న సంస్థకే కన్నం వేశాడో ఉద్యోగి. సికింద్రాబాద్‌కు చెందిన అభిషేక్ అర్కుట్‌కు బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 11లోని పేవ్ టెక్ ఇండియా పేరిట డిజిటల్ తాళాలు తయారు చేసే సంస్థ ఉంది. ఈ నెల 16న ఆఫీసు మూసి వేసి ఇంటికి వెళ్లిన తరువాత కార్యాలయంలో తలుపు ఎవరో తెరిచినట్టు అతని ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. కొద్ది సేపటికి సీసీ కెమెరాలు పరిశీలించగా సంస్థలో పనిచేసే న్యూ మలక్‌పేటకు చెందిన షేక్ మహ్మద్ బిలాల్ తలుపు తెరిచి స్టోర్ రూంలోకి వెళ్లి రూ.30 వేల విలువ చేసే డిజిటల్ తాళాలు చోరీ చేసినట్టు తేలింది. అభిషేక్ ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పనిచేసిన డబ్బులు అడిగినందుకు దాడి

బంజారాహిల్స్, మే 19(ఆంధ్రజ్యోతి): పనిచేసిన డబ్బులు అడిగినందుకు ప్లంబర్ పై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 13లో నివసించే అశిష్‌కుమార్ దాల్ ప్లంబర్. ఈ నెల మొదటి వారంలో అరుణ్‌కుమార్ నాయక్ ఇంట్లో రెండు రోజుల పాటు పనిచేశాడు. ఈ డబ్బులు ఇవ్వకుండా అరుణ్‌కుమార్ ఇబ్బంది పెట్టాడు. ఈ నెల 17న అశిష్ పలుమార్లు ఫోన్ చేసినా అరుణ్‌కుమార్ ఫోన్ ఎత్తలేదు. 18వ తేదీన అశిష్ తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురు వచ్చిన అరుణ్‌కుమార్ దుర్భాషలాడి, అశిష్ చేతిని మెలిపెట్టి తీవ్రంగా కొట్టాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్లు చోరీ.. ప్రశ్నించిన వ్యక్తిపై బ్లేడుతో దాడి

బంజారాహిల్స్, మే 19(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్లు చోరీ చేస్తూ దొరికాడు. ప్రశ్నించిన వ్యక్తిపై బ్లేడుతో దాడి చేసి గాయపర్చాడు. కృష్ణానగర్‌కు చెందిన షేక్ మున్నా స్థానిక శీతల్ లాడ్జిలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 17న గుర్తుతెలియని వ్యక్తి వచ్చి రెండు సెల్‌ఫోన్లను చోరీ చేశాడు. అక్కడే ఉన్న లాడ్జి యజమాని అతన్ని పట్టుకొని సెల్‌ఫోన్లను వాటి యజమానులకు అప్పగించి నిందితుడిని మున్నాకు అప్పగించాడు. ఆ వ్యక్తి వద్ద నుంచి మున్నా సెల్‌ఫోన్ లాకున్నాడు. ఈ విషయంలో గొడవ జరగగా నిందితుడు మున్నాపై బ్లేడుతో దాడి చేశాడు. మున్నాకు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి ముందు పార్క్ చేసిన బైక్ మాయం

యూసుఫ్‌గూడ, మే 19 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు పార్క్ చేసిన బైక్ మాయమైన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరినగర్‌కు చెందిన ఎన్.రాజు ఈ నెల 17న రాత్రి తన ఇంటి ముందు బైక్ పార్క్ చేసి పడుకున్నాడు. తెల్లవారి లేచి చూడగా ఇంటి ముందు బైక్ కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా బైక్ జాడ దొరకకపోవడంతో రాజు మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ నేత సతీష్‌రెడ్డిపై చీటింగ్ కేసు

హైదర్‌నగర్, మే 19(ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వ్యాపారి వద్ద డబ్బులు తీసుకుని మోసం చేసిన కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డిపై కేపీహెచ్‌బీ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. సనత్‌నగర్ జెక్‌కాలనీకి చెందిన రౌతు మురళీమోహన్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. 2022లో మల్లికార్జున్ అనే ఏజెంట్ ద్వారా సంగారెడ్డి జిల్లా ఇంద్రకరణ్ గ్రామంలోని సర్వే నంబర్ 359, 364లో 11 ఎకరాల 22గుంటల భూమి అమ్మకానికి ఉందని తెలిసింది. ఆ భూమికి సంబంధించిన విషయాలను శేరి సతీష్‌రెడ్డి చూస్తున్నాడని మల్లికార్జున్ ద్వారా తెలుసుకుని అతనితో కలిసి వెళ్లి సతీష్‌రెడ్డిని కలిశాడు. ఆ భూమి తన అక్క జయశ్రీ, బావ బ్రహ్మానందరెడ్డి వాళ్లదని చెప్పిన సతీష్‌రెడ్డి 2 ఎకరాలను రూ.3.40కోట్లకు కొనుగోలు చేస్తే మిగిలిన భూమిని డెవలప్‌మెంట్‌కు ఇచ్చేట్టుగా ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో మురళీమోహన్ పలు దఫాలుగా సతీష్‌రెడ్డికి రూ.2.7 కోట్లు చెల్లించాడు. వీటితో పాటు జయశ్రీ పేరుమీద రూ.కోటికి చెక్కు ఇచ్చాడు.

చెక్ బౌన్స్ అయిందంటూ..

కొన్ని రోజుల తర్వాత ఆ చెక్ బౌన్స్ అయిందని కేసు పెట్టిన సతీష్‌రెడ్డి మురళీమోహన్ దగ్గర రూ.కోటి వసూలు చేశాడు. అదే సంవత్సరం అక్టోబరు 29న కోటి రూపాయాలు తీసుకుని మురళీమోహన్‌కు డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ చేశాడు. ఆ తర్వాత జయశ్రీని సంప్రదించగా మరో రూ.కోటి ఇస్తేనే రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పారు. దీంతో వారు అడిగిన డబ్బు చెల్లించి భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. అయితే, తనను సతీష్‌రెడ్డి, జయశ్రీ, బ్రహ్మానందరెడ్డి మోసం చేశారని శనివారం కేపీహెచ్‌బీ పోలీసులకు మురళీమోహన్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మరో కేసులో..

తనను అసభ్య పదజాలంతో దూషించాడని కాంగ్రెస్ యువనాయకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సతీష్‌రెడ్డిపై కేపీహెచ్‌బీ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కేపీహెచ్‌బీ ఎస్ఐ శ్రీనివాస్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. సతీష్‌రెడ్డి, అతని అనుచరుడు బచ్చుపల్లి తనను అసభ్య పదజాలంతో దూషించారని కాంగ్రెస్ యువ నాయకుడు శివచౌదరి ఈ నెల 3న కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కోర్టు అనుమతి తీసుకుని కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బండపల్లి చంద్రమ్మ సేవలు చిరస్మరణీయం

● రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్


చంద్రమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్

బోరబండ, మే 19 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ బండపల్లి చంద్రమ్మ సేవలు చిరస్మరణీయమని రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. సోమవారం స్థానిక గ్రంథాలయ కూడలిలో చంద్రమ్మ చిత్రపటానికి ఆయన నివాళులర్పించారు. రెండుసార్లు కార్పొరేటర్‌గా పనిచేసిన చంద్రమ్మ రహమత్‌నగర్ డివిజన్ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా చంద్రమ్మ తనయుడు, నగర కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి బి.భవానీశంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని అనిల్‌కుమార్ యాదవ్ ప్రారంభించారు. సాధురాం ఐ హాస్పిటల్, రెనోవా హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన వైద్య శిబిరంలో 400మందిని వైద్యులు పరీక్షించారు. అవసరమైన వారికి కళ్లజోళ్లు ఉచితంగా అందజేశారు. కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు ఎం.డి.మోసిన్ ఖురేషి, బి.అశోక్, కృష్ణ, రహమత్‌నగర్ డివిజన్ జనరల్ సెక్రెటరీ. గ్యార నాగరాజు. మహిళా కాంగ్రెస్ రహమత్‌నగర్ జనరల్ సెక్రెటరీ సువర్ణమ్మ, అరుణ్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, రాంబాబు, సతీష్, యువజన కాంగ్రెస్ రహమత్‌నగర్ డివిజన్ వైస్ ప్రెసిడెంట్ శివ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగడ్డ, మే 19 (ఆంధ్రజ్యోతి): మాజీ కార్పొరేటర్ బండపల్లి చంద్రమ్మ వర్ధంతి సభలో మహ్మద్ అజారుద్దీన్ తనయుడు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మహ్మద్ అసదుద్దీన్ కాంగ్రెస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి దూడల రవిగౌడ్, నాయకులు బి.అశోక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రమ్మ చిత్రపటానికి వారు పుష్పాంజలి ఘటించారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్


కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని

మారేడుపల్లి మే 19(ఆంధ్రజ్యోతి): అర్హులందరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. సోమవారం వెస్ట్ మారేడుపల్లిలోని తన కార్యాలయంతో 11 మంది లబ్ధిదారులకు 6.10 లక్షల రూపాయల విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక సమస్యల కారణంగా అనేకమంది మెరుగైన వైద్యం పొందలేకపోతున్నారని అలాంటి వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం మంజూరు చేయించిన విషయాన్ని గుర్తుచేశారు. అత్యవసర వైద్యం అవసరమైన వారికి కూడా ఎల్ఓసీల ద్వారా ఆర్థిక సహాయం మంజూరు చేయించినట్లు వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కుర్మ హేమలత, మాజీ కార్పొరేటర్ మల్లికార్జున్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్, హన్మంతరావు, హరికృష్ణ, వెంకటేషన్ రాజు, అశోక్ యాదవ్, శ్రీహరి, కిషోర్, కూతురు నర్సింహ, లక్ష్మీపతి, ప్రేమ్‌కుమార్, ఆరీఫ్, బలరాం, ఉత్తమ్ కుమార్ సింగ్, హరిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బాన్డీ చాంపియన్‌గా తెలంగాణ



పతకాలతో క్రీడాకారులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ బాన్డీ ఫెడరేషన్ కప్‌లో తెలంగాణ జట్టు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. విశాఖపట్నంలో జరిగిన ఈ పోటీల్లో గుజరాత్, హరియాణా, ఉత్తరప్రదేశ్, కేరళ, కర్ణాటక, తమిళనాడుతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వివిధ కేటగిరీల్లో కలిపి తెలంగాణ 4 స్వర్ణాలు, 2 రజతాలతో 26 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. గుజరాత్ 4 స్వర్ణాలతో ద్వితీయ, హరియాణా ఒక స్వర్ణం, ఒక రజతం, 3 కాంస్యాలతో తృతీయ స్థానం దక్కించుకున్నాయి. కోచ్ మహ్మద్ నసీరుద్దీన్, క్రీడాకారులను రాష్ట్ర బాన్డీ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాస్ రెడ్డి అభినందించారు.

అన్ని సమస్యలను పరిష్కరిస్తున్నాం

● ఉపకమిషనర్ ప్రశాంతి

గచ్చిబౌలి, మే 19(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో తమ దృష్టికి వచ్చిన ప్రతీ సమస్యను పరిష్కరిస్తున్నామని, వారం రోజుల్లో సమస్యను పరిష్కరించి ఫిర్యాదుదారుడికి విషయం తెలియజేస్తున్నామని ఉపకమిషనర్ ప్రశాంతి తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఐదు ఫిర్యాదులు వచ్చాయని, అందులో నాలుగు అక్రమ నిర్మాణాలపై రాగా, ఒకటి పారిశుధ్య సమస్యపై అందిందన్నారు. అక్రమ నిర్మాణాలపై ఇప్పటికే ఉక్కుపాదం మోపుతున్నామని, నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చి సరైన స్పందన లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక విభాగం, పారిశుధ్యం, ఇంజనీరింగ్, రెవెన్యూ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.


ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఉపకమిషనర్ ప్రశాంతి

వివాదాస్పద భూమిలో నిర్మాణాలను కూల్చండి

● ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన భూమి యజమానులమని చెబుతున్న వ్యక్తులు

గచ్చిబౌలి, మే 19(ఆంధ్రజ్యోతి): కోర్టు ఉత్తర్వులను పట్టించుకోకుండా నిర్మాణాలు చేపట్టిన భవనాలను వెంటనే కూల్చివేయాలని భూ యజమానులమని చెబుతున్న కొందరు డిమాండ్ చేశారు. శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలి గ్రామ సర్వే నంబర్లు 51, 52, 53లలో ఉన్న సుమారు 40 ఎకరాల భూమి విషయంలో చాలాకాలంగా కోర్టులో వివాదం నడుస్తుంది. ఇటీవల ఆ భూమిపై యథాతథ స్థితిని కొనసాగించాలని కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులను ఖాతరు చేయకుండా పలువురు కాలనీవాసులు నిర్మాణాలు చేపట్టారు. ఈ విషయంపై యజమానులు కోర్టును ఆశ్రయించగా నిర్మించిన భవనాలను కూల్చివేసి కోర్టుకు రిపోర్టు ఇవ్వాలని తీర్పు వెల్లడించింది. తాజా ఉత్తర్వుల ప్రకారం అధికారులు ఆ భూమిలో వెలసిన భవనాలను కూల్చివేసి కోర్టుకు రిపోర్టు చేయాలి. కానీ, అధికారులు కాలయాపన చేస్తున్నారని యజమానులు ఆరోపించారు. సోమవారం శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ఈ విషయంపై ఫిర్యాదు చేసినట్లు వారు వివరించారు. తమ ఉత్తర్వులు ఉండగా ఆ భూముల్లో నిర్మాణాలు ఎలా వచ్చాని జీహెచ్ఎంసీ అధికారులపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిందని వారు వివరించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వివాదాస్పద భూమిలో వెలసిన నిర్మాణాలను వెంటనే కూల్చివేయాలని వారు విజ్ఞప్తి చేశారు.


డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వనం సంగీతాయాదవ్

దశల వారీగా సమస్యల పరిష్కారం

● కార్పొరేటర్ వనం సంగీతాయాదవ్

బంజారాహిల్స్, మే 19(ఆంధ్రజ్యోతి): దశల వారీగా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతాయాదవ్ అన్నారు. ఎల్లారెడ్డిగూడ సుభాష్‌నగర్‌లో రూ.15 లక్షలతో డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్‌లో మురుగు సమస్య ఉన్న ప్రాంతాల్లో నూతన పైప్‌లైన్లు వేస్తున్నట్లు తెలిపారు. ఈ పనులు పూర్తి కాగానే సీసీ రోడ్లు వేసేలా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

మహానేత పుచ్చలపల్లి సుందరయ్య

పంజాగుట్ట, మే 19(ఆంధ్రజ్యోతి): భూస్వామ్య కుటుంబంలో పుట్టి పేదల కోసం, కార్మికవర్గం కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహానేత పుచ్చలపల్లి సుందరయ్య అని సీఐటీయూ జూబ్లీహిల్స్ జోన్ కమిటీ కన్వీనర్ ఆర్.అశోక్ అన్నారు. సీఐటీయూ జూబ్లీహిల్స్ కమిటీ ఆధ్వర్యంలో జవహర్‌నగర్‌లో సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దున్నే వానికే భూమి అని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నడిపి పది లక్షల ఎకరాల భూ పంపిణీ చేసిన నాయకుడు సుందరయ్య అని కొనియాడారు. దేశంలో మొట్టమొదటగా వ్యవసాయ కార్మికులకు సంఘం పెట్టి భూస్వాములకు, కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన మహానాయకుడు అని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.


ఎర్రమంజిల్ ఆర్‌అండ్‌బీ భవనంలో చీఫ్ ఇంజనీర్ వై.లింగారెడ్డిని తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి మాజీద్ హైమద్, ఎలక్ట్రికల్ లెసెన్సింగ్ బోర్డు మాజీ సభ్యులు సదానంద్ గౌడ్, నక్క యాదగిరి, సుజయ్‌కుమార్ సోమవారం కలిశారు. ఎస్ఎస్ఆర్ రేట్లు పెంచాలని, బిల్లులు సకాలంలో వచ్చేలా చూడాలని కోరారు.

- హైదరాబాద్ సిటీ, మే 19(ఆంధ్రజ్యోతి)



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కంటోన్మెంట్ ఐదో వార్డు కాకాగూడ బస్తీకి చెందిన సంధ్యారాణికి ఆపరేషన్ నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.2లక్షల 50 వేలను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ సహకారంతో ఎల్‌ఓసీ సీనియర్ నాయకులు పెద్దాల నరసింహ యాదవ్ వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

- మారేడుపల్లి, ఆంధ్రజ్యోతి



కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మారేడుపల్లి మే 19(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం వెస్ట్ మారేడుపల్లిలోని తన కార్యాలయంలో 11 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి 7, షాదీముబారక్ 4 కింద మంజూరైన రూ.6.10 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక సమస్యల కారణంగా అనేకమంది మెరుగైన వైద్యం పొందలేకపోతున్నారని అలాంటి వారికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక సహాయం మంజూరు చేయించిన విషయాన్ని గుర్తుచేశారు. అలాగే అత్యవసర వైద్యం అవసరమైన వారికి కూడా ఎల్‌ఓసీల ద్వారా ఆర్థిక సహాయం మంజూరు చేయించినట్లు వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కుర్మ హేమలత, మాజీ కార్పొరేటర్ మల్లికార్జున్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్, హన్మంతరావు, హరికృష్ణ, వెంకటేషన్ రాజు, అశోక్ యాదవ్, శ్రీహరి, కిషోర్, కూతురు నర్సింహ, లక్ష్మీపతి, ప్రేమ్‌కుమార్, ఆరీఫ్, బలరాం, ఉత్తమ్ కుమార్ సింగ్, హరిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

గుల్జార్‌హౌస్ అగ్ని ప్రమాదం దురదృష్టకరం

● డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్ రెడ్డి



తార్నాక, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఓల్డ్ సిటీలోని గుల్జార్‌హౌస్‌లో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదం దురదృష్టకరమని, ఆ సంఘటన తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తార్నాకలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అగ్నిప్రమాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు సానుభూతిని తెలపడంతో పాటు, బాధిత కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ఆర్థికంగా అండగా ఉంటుందని భరోసాను కల్పించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా ఫైర్‌సేఫ్టీ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, అందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



దంగల్ లోపలి ఆవరణలో పెండింగ్ పనులు

భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలి

క్రీడాకారుల అసహనం ● పట్టించుకోని అధికారులు



అసంపూర్తిగా దంగల్ (కుస్తీ) భవనం

మారేడుపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): మారేడుపల్లి డివిజన్ పరిధిలోని వెస్ట్ మారేడుపల్లి నెహ్రూనగర్ పార్క్ ఆవరణలో పూర్వకాలం నాటి కుస్తీ పోటీలు నిర్వహించుకోవడానికి గాను (దంగల్) శిక్షణ భవనాన్ని ప్రతిష్ఠాత్మకంగా గత ప్రభుత్వం నిర్మించి పూర్తి చేయకుండానే వదిలి వేసింది. ప్రస్తుత ప్రభుత్వం దంగల్ భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. ఈ పనులు ప్రారంభించి ఆరు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఇంకా పనులు పూర్తి కాకపోవడంతో క్రీడాకారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. 70% పనులు పూర్తయినప్పటికీ మిగతా పనులు పూర్తవకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తుంది. జీహెచ్‌ఎంసీ అధికారులు ఈ పెండింగ్ పనులను పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని క్రీడాకారులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మారేడుపల్లి సీనియర్ సిటిజన్స్, నెహ్రూనగర్ పార్క్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు పెండింగ్ పనులు పూర్తిచేసి కుస్తీ క్రీడాకారులకు భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.

పూర్తి చేస్తాం

దంగల్ శిక్షణ భవనంలో అసంపూర్తిగా ఉన్న పనులను త్వరలోనే పూర్తిచేస్తాం. ఇప్పటివరకు పనులు చాలావరకు పూర్తి చేశాం. భవనం లోపలి పనులు, వివిధ వసతుల పనులు మాత్రం పూర్తిచేయాల్సి ఉంది. పూర్తి అయ్యేలా చర్యలు చేపడతాం.

- చంద్రశేఖర్, ఏఈ, జీహెచ్‌ఎంసీ

ఆసుపత్రి పనులు త్వరగా పూర్తి చేయాలి

● మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

తిరుమలగిరి మే 19 (ఆంధ్రజ్యోతి): టిమ్స్ ఆసుపత్రి నిర్మాణ పనుల్లో సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, పనుల్లో తాత్సారం ఉండకూడదని, నిర్దీత గడువులోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు, సంబంధిత అధికారులకు మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సూచించారు. సోమవారం అల్వాల్‌లోని టిమ్స్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షా సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఆసుపత్రి పనుల పురోగతిపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సంబంధిత కాంట్రాక్టరు కలెక్టరుకు వివరించారు. 90 శాతం పనులు పూర్తయ్యాయని రెండు నెలల్లో మిగితా పనులు పూర్తవుతాయని, కొన్నిచోట్ల రీ డిజైన్ వల్ల అదనపు నిధులు అవసరమవుతాయని కాంట్రాక్టరు కలెక్టర్‌కు తెలియజేశారు. నిర్మాణానికి సంబంధించి చట్టబద్ధమైన ఆమోదాలన్నీ లభించాయని అధికారులు తెలిపారు. అదేవిధంగా ఈ ఆసుపత్రిలో టీచింగ్, నర్సింగ్ కాలేజీలు కూడా నిర్మించడం జరుగుతుందని తెలిపారు. ఆసుపత్రిలో ఫర్నిచర్ ఏవిధంగా అందిస్తారని కలెక్టర్ ప్రశ్నించగా అగ్రిమెంట్‌లో ఒప్పందం ప్రకారం ఏర్పాటు చేయడం జరుగుతుందని వారు వివరించారు. డిసెంబర్ 2025 నాటికి పూర్తి చేసి అప్పగిస్తామని కాంట్రాక్టర్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఈఈ వనజ, ఈఈ శ్రీనివాస్ రెడ్డి, డీఎంహెచ్‌ఓ ఉమగౌరీ, అల్వాల్ తహసీల్దార్ రాములు, కాంట్రాక్టర్లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించాలి

● దక్షిణాది జేఏసీ చైర్మన్ ప్రొ. గాలి వినోద్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొ. గాలి వినోద్ కుమార్ తదితరులు

తార్నాక, మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులను వెంటనే కల్పించాలని దక్షిణాది జేఏసీ చైర్మన్ ప్రొ. గాలి వినోద్ కుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం తార్నాకలోని దక్షిణాది జేఏసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులను కల్పించాలని కోరుతూ ఆ పార్టీ జాతీయ నాయకులు రాహుల్‌గాంధీకి బహిరంగలేఖను పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద, సంచార జాతుల ఆర్థికాభివృద్ధికి మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ 24లక్షల ఎకరాల భూమిని పంచితే ఇప్పటివరకు ప్రభుత్వాలు వారికి భూములపై యాజమాన్య హక్కులను కల్పించలేదని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో వరంగల్‌లో రైతు డిక్లరేషన్‌లో రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు యాజమాన్య హక్కులను కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సీఎం చట్టం తీసుకువచ్చి అసైన్డ్ భూముల వాస్తవ యాజమానులకు సంపూర్ణ యాజమాన్య హక్కులను కల్పించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఎంబీఎస్‌సీ కులాల రిజర్వేషన్స్ పోరాట సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేశం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి ఆధ్వర్యంలో జరిగిన తిరంగా ర్యాలీ

ఆకట్టుకున్న తిరంగా ర్యాలీ

సికింద్రాబాద్, మే 19(ఆంధ్రజ్యోతి): పహల్గాం దాడి అనంతరం ప్రధాని మోదీ తీసుకున్న సాహసోపేత నిర్ణయం, పాక్ తీవ్రవాదులకు, పాక్ పాలకులకు గుణపాఠం చెప్పడాన్ని యావత్ ప్రపంచం అభినందిస్తోందని బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్ అన్నారు. సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్ నుంచి ఎంజీ రోడ్డులోని మహత్మాగాంధీ విగ్రహం వరకు సోమవారం సాయంత్రం బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భారత్ మాతా కీ జై.. అనే నినాదాలు చేస్తూ, త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడిస్తూ ప్రధాన రహదారుల మీదుగా జరిగిన తిరంగా ర్యాలీ పలువురిని ఆకట్టుకుంది. భరతమాత, ప్రధాని మోదీలకు అనుకూలంగా చేసిన నినాదాలతో పరిసరాలు మారుమోగాయి. మాజీమంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, మోండా మార్కెట్ కార్పొరేటర్ కొంతం దీపిక, రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర, కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మద, నాయకులు రాజశేఖరరెడ్డి, శివాజీ, బీ.ఎన్.శ్రీనివాస్, శ్రీశైలంగౌడ్, కృష్ణమూర్తి, హనుమంత్ ముదిరాజ్, మేకల కీర్తి హర్షకిరణ్, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఆస్పత్రిలో రక్తపోటుపై అవగాహన

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా సోమవారం సికింద్రాబాద్ మెట్టుగూడలోని కేంద్రీయ రైల్వే ఆస్పత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆస్పత్రిలో ఇంటరాక్టివ్ లెర్నింగ్ సెషన్ అనంతరం చికిత్స పొందుతున్న రోగులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైల్వే ఆస్పత్రి చీఫ్ స్టాఫ్ సర్జన్ కార్డియోలాజీ డాక్టర్ ఎస్ వీబీకే సాయి, డాక్టర్ సుష్మ, చీఫ్ సర్జన్ డాక్టర్ కృష్ణవేణి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహితలు పాల్గొన్నారు.

క్రైమ్ సమాచారం

అల్మారీలోంచి బంగారు పుస్తెల తాడు చోరీ

బేగంపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): అల్మారీలో ఉన్న 30గ్రాముల బంగారు పుస్తెలతాడు చోరీకి గురైన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జింకలవాడలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సనత్‌నగర్‌లోని జింకలవాడలో ఉంటున్న నర్సు శనిగరపు సోనీ(27) ఈ నెల 17న ఇంటిలోని అల్మారీలో పుస్తెలతాడు పెట్టి స్నానానికి వెళ్లింది. అనంతరం వచ్చి చూడగా అల్మారీలో ఉండాల్సిన పుస్తెల తాడు కనబడలేదు. దీంతో బాధితురాలు వెంటనే సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో పర్సు చోరీ

అమీర్‌పేట, మే 19 (ఆంధ్రజ్యోతి): బంగారు ఆభరణాలు, క్రెడిట్, డెబిట్ కార్డులతో ఉన్న మహిళ పర్సు బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో చోరీకి గురైంది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు సోమవారం వెల్లడించారు. సికింద్రాబాద్ చిలకలగూడకు చెందిన అనంతాల సుధ బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేట్ సంస్థలో పని చేస్తోంది. ఆదివారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులతో కలిసి బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకునేందుకు వచ్చారు. ఆమె వద్ద ఉన్న బంగారు గొలుసు, బ్రాస్‌లెట్, క్రెడిట్, డెబిట్ కార్డులతో పాటు చెవిరింగులు ఓ పర్సులో పెట్టి హ్యాండ్ బ్యాగులో వేసింది. అమ్మవారి దర్శనం అనంతరం బ్యాగులోని పర్సు కోసం చూడగా పర్సు కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో ఎస్‌ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. చోరీకి గురైన వస్తువుల విలువ రూ.60 వేలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా గత 12వ తేదీన కూడా కూతురుతో కలిసి అమ్మవారిని దర్శించుకున్న ఓల్డ్ బోయిన్‌పల్లికి చెందిన అర్లగడ్డ రాజశేఖర్ ఆలయం ముందున్న స్టాండ్‌లో తన పాదరక్షలు తీసుకుంటుండగా వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి పాదరక్షలకు సంబంధించి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేసి, అతడ్ని వెంబడిస్తూ క్యాబ్‌లోకి ఎక్కుతున్న రాజశేఖర్ సెల్‌ఫోన్‌ను లాక్కొని పరారయ్యాడు. వరుసగా జరుగుతున్న దొంగతనాలతో భక్తులు ఆందోళన చెందుతున్నారు. ఈ దొంగతనాలపై ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు దృష్టి సారించడంతో పాటు ఆలయ అధికారులు సెక్యూరిటీ సిబ్బందిని పెంచాలని కోరుతున్నారు.

పెళ్లి పేరుతో వృద్ధుడికి టోపీ.. ఇద్దరు మహిళల అరెస్ట్



సరస్వతి



కూనపరెడ్డి స్వాతి

అడ్డగుట్ట, మే 19 (ఆంధ్రజ్యోతి): పెళ్లి సంబంధాల పేరుతో వృద్ధుడిని మోసం చేసిన ఇద్దరు మహిళలను సోమవారం మహంకాళి పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మ్యారేజ్ బ్యూరో పేరుతో ఓ దినపత్రిక(ఆంధ్రజ్యోతి కాదు)లో ప్రకటనలు ఇచ్చారు. మ్యారేజ్‌బ్యూరో నడుపుతున్నామని చెప్పి సరస్వతి, కూనపరెడ్డి స్వాతిలు పెళ్లి పేరుతో మోసం చేసి రూ.1,77,000లను కాజేశారని ఖమ్మం జిల్లాకు చెందిన ఇరుకుమాటి చినకొండయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఇద్దరు మహిళలను సోమవారం అరెస్టు చేసి, విచారణ అనంతరం స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు.

మల్కాజిగిరిలో విషాదం

మల్కాజ్‌గిరి, మే 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదంలో భార్య మృతి చెందగా.. భర్త చికిత్స పొందుతున్న సంఘటన మల్కాజిగిరిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా చిమన్‌గుంటపల్లికి చెందిన కవిత(30), రవి(35) భార్యాభర్తలు. బతుకుదెరువు కోసం రెండు సంవత్సరాల క్రితం మల్కాజ్‌గిరికి వచ్చి ఇందిరా నెహ్రూనగర్‌లో నివాసముంటూ కూలీ పనులు చేసుకుంటున్నారు. ఆదివారం సాయంత్రం ఇందిరా నెహ్రూ నగర్‌లోని ఓ భవన నిర్మాణంపై పనిచేస్తూ ఇనుపరాడ్‌ను ఇద్దరూ పట్టుకుని జరిపే ప్రయత్నంలో పక్కనే ఉన్న విద్యుత్ హైటెన్షన్ తీగలు తగిలాయి. ప్రమాదంలో భార్య మృతి చెందగా.. భర్త ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనపై కవిత తల్లి దావ్‌లీ మల్కాజ్‌గిరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. భవన యజమాని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే తన కూతురు, అల్లుడు విద్యుదాఘాతానికి గురయ్యారని, వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

బయోగ్యాస్ ప్లాంట్‌ను పునరుద్ధరించాలి



బయోగ్యాస్ ప్లాంట్‌ను పునరుద్ధరించాలని మార్కెట్‌యార్డ్ అధికారి వెంకన్న, చైర్మన్ ఆనంద్‌బాబులకు వినతిపత్రాన్ని అందజేస్తున్న టీఎన్ శ్రీనివాస్

బోయినపల్లి, మే 19(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో బోయినపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన బయోగ్యాస్ ప్లాంట్ ప్రస్తుత ప్రభుత్వం మూసివేయడం అన్యాయమని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మార్కెట్ యార్డులోని బయోప్లాంట్‌ను బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ప్లాంట్ వద్ద ఆయన నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మార్కెట్ యార్డు చైర్మన్ ఆనంద్ బాబు, మార్కెట్ యార్డ్ కార్యదర్శి వెంకన్నలకు ప్లాంటును పునఃప్రారంభించాలని వినతి పత్రాలు అందజేశారు. మార్కెట్ యార్డ్ గత నెలా 15 రోజులుగా మూతపడి ఉండటం శోచనీయమన్నారు. యార్డ్‌లోని బయోప్లాంట్‌లో మార్కెట్‌లో నిరుపయోగంగా ఉండే కూరగాయలను వినియోగించుకుని ప్రతిరోజు 150 యూనిట్ల విద్యుత్, 400 యూనిట్ల బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేస్తుండేదన్నారు. ఈ బయోప్లాంట్ పనితీరును ప్రధాని మన్ కీ బాత్‌లో చర్చించి మార్కెట్ యార్డులోని బయోప్లాంట్ వినియోగం ఎంతో గొప్పదని ప్రశంసించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. వెంటనే బయోగ్యాస్ ప్లాంట్ పునఃప్రారంభానికి చైర్మన్, కార్యదర్శులు టెండర్ల ప్రక్రియను వేగవంతం చేసి ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ ఉదయ్ యాదవ్, మాజీ డైరెక్టర్లు షర్విన్ కుమార్, నారాయణ, బీఆర్‌ఎస్ పార్టీ వార్డుల అధ్యక్షుడు కిరణ్‌కుమార్ ముదిరాజ్, అడెలి ఆనంద్, నాయకులు శత్రుసింహారెడ్డి, శేఖర్, రవి, రాము, మల్లేష్, నర్సింహ, ప్రవీణ్ బాబు తదితరులు పాల్గొన్నారు.



పతకాలతో క్రీడాకారులు

జాతీయ బాండీ చాంపియన్‌గా తెలంగాణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ బాండీ ఫెడరేషన్ కప్‌లో తెలంగాణ జట్టు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. విశాఖపట్నంలో జరిగిన ఈ పోటీల్లో గుజరాత్, హరియాణా, ఉత్తర ప్రదేశ్, కేరళ, కర్ణాటక, తమిళనాడుతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వివిధ కేటగిరీల్లో కలిపి తెలంగాణ 4 స్వర్ణాలు, 2 రజతాలతో 26 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. గుజరాత్ 4 స్వర్ణాలతో ద్వితీయ, హరియాణా ఒక స్వర్ణం, ఒక రజతం, 3 కాంస్యాలతో తృతీయ స్థానం దక్కించుకున్నాయి. కోచ్ మహ్మద్ నసీరుద్దీన్, క్రీడాకారులను రాష్ట్ర బాండీ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాస్ రెడ్డి అభినందించారు.



హోమం చేస్తున్న జాజుల రాజేష్

ముగిసిన అమ్మవారి కల్యాణోత్సవం

తిరుమలగిరి మే 19 (ఆంధ్రజ్యోతి): బొల్లారం లోతుకుంట సరస్వతినగర్‌లోని గండిమైసమ్మ తృతీయ వార్షికోత్సవం, దివ్య కల్యాణ మహోత్సవ వేడుకలు మూడు రోజుల పాటు జరిగి సోమవారం ముగిశాయి. అమ్మవారి శాంతి హోమం, నవగ్రహ సహిత కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించి తరించారు. కోరిన కోర్కెలు తీర్చే చల్లని తల్లి కొంగు బంగారమై భక్తుల కోర్కెలు తీర్చుతుందని స్థానికుల ప్రగాఢ విశ్వాసం. అనంతరం జరిగిన అన్నదాన వితరణలో భక్తులు పాల్గొన్నారు. దేవాలయం ఫౌండర్ జాజుల యాదగిరి అన్ని ఏర్పాటు చేశారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్‌వీ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 19 (ఆంధ్రజ్యోతి): పెండింగులో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని బీఆర్‌ఎస్‌వీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు రూ.8,200కోట్ల స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బడ్జెట్‌లో విద్యారంగానికి సరిపడా నిధులు కేటాయించకపోవడం సిగ్గు చేటని మండిపడ్డారు. కనీసం విద్యాశాఖకు మంత్రిని కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థలపై ప్రభుత్వం ఉక్కు పాదం మోపాలని, ఫీజు నియంత్రణ కమిటీని నియమించాలని వారు డిమాండ్ చేశారు. బకాయిలను జూన్ మొదటి వారంలోపు విడుదల చేయకుంటే సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌వీ నాయకులు నాగారం ప్రశాంత్, ఏల్పుకొండ రామకృష్ణ, సంతోశ్, మహేశ్, నిఖిల్, గౌతమ్, సతీశ్, హుస్సేన్, దామోదర్, హరీశ్, పాషా పాల్గొన్నారు.



ఆర్‌యూబీ పనులను పరిశీలిస్తున్న రైల్వే అధికారి రవిప్రకాశ్

తుర్కపల్లిలో త్వరలో ఆర్‌యూబీ పనులు

అల్వాల్, మే 19 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు తుర్కపల్లిలో ఆర్‌యూబీ పనులను త్వరలో చేపట్టనున్నట్లు రైల్వే అధికారి రవిప్రకాశ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం తుర్కపల్లి వద్ద రూ.4కోట్ల వ్యయంతో నిర్మించే పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అల్వాల్‌లోని తుర్కపల్లి, బొల్లారం, బీహెచ్‌ఈఎల్ నుంచి భూదేవినగర్‌కు వెళ్లే ప్రాంతాల్లో ఆర్‌యూబీలతోపాటు ఆర్‌వోబీ నిర్మాణాలను చేపడుతున్నట్టు తెలిపారు. మరో రెండు రోజుల్లో తుర్కపల్లిలో పనులు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. ప్రాజెక్ట్ అధికారి ఉషన్‌రెడ్డి, ఇంజనీర్ నరసింహారెడ్డి, జలమండలి అధికారులు సుజయ్, రమేశ్, నాయకులు రమేశ్, అనిల్, కిషోర్, శోభన్‌బాబు, పరమేశ్, దేవేందర్, జావెద్, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జోరుగా మామిడిపండ్ల అమ్మకాలు

చిలకలగూడ, మే 19(ఆంధ్రజ్యోతి): పండ్లలో రారాజు మామిడి పండును ఇష్టం లేని వారు ఉండరు. పసుపు పచ్చని బంగారు రంగు, రుచితో కనువిందు చేస్తున్నాయి. పోషక విలువలు అధికంగా వుండి శరీరానికి మేలు చేస్తాయని వైద్యులు సూచిస్తున్నారు. బేనిషా, ఇమామ్ పసంద్, అల్ఫాన్సో చిన్న రసాలు, పెద్ద రసాలు వున్నా.. బంగినపల్లి పండ్లు అధికంగా లభిస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో విరివిగా లభ్యమవుతున్నాయి. ధర విషయానికి వస్తే కిలో 80 నుంచి 120రుపాయల వరకు పలుకుతున్నాయి. గత సంవత్సరంతో పోలిస్తే దిగుబడి అధికంగా వుందని, అలాగే ధరలు కూడా తక్కువగా ఉన్నట్లు మార్కెట్ వర్గాల భోగట్టా. బంగినపల్లి రకం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయని దొరబాబు అనే వ్యాపారి తెలిపాడు.



అమ్మకానికి సిద్ధంగా వున్న మామిడి పండ్లు